మెట్టలో ముమ్మరంగా రబీ సాగు

- 80 శాతం పూర్తయిన నాట్లు
- సబ్ డివిజన్‌లో 8,228 ఎకరాల్లో వరి సాగుకు సన్నాహాలు
- అందని పెట్టుబడి సాయం


మెట్టలో వ్యవసాయ బోర్ల క్రింద వేసిన వరి పంట


మెట్టలో సాగు చేస్తున్న మొక్కజొన్న

చింతలపూడి: మెట్ట రైతాంగం ఇప్పుడు రబీ సాగులో నిమగ్నమై ఉన్నారు. ఈ సంవత్సరం తొలకరిలో వర్షాలు ఆశించిన విధంగా కురవడంతో రైతులు ఖరీఫ్ సాగు చేపట్టారు. అనంతరం వరుస తుఫాన్ల ప్రభావంతో కురిసిన వర్షాలకు మళ్లీ చెరువుల్లో నీళ్లు చేరాయి. వీటికి తోడు ఈ ఏడాది భూగర్భ జలాలపై మెట్ట రైతాంగం ఆశలు పెట్టుకుని రబీ సాగులో అడుగుపెట్టారు. గత ఏడాది ఖరీఫ్‌లో కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు అందిస్తుందని ఎదురు చూసిన రైతులకు కూటమి ప్రభుత్వం నెత్తిన టోపి పెట్టింది. దీంతో రైతులు పెట్టుబడుల కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించక తప్పలేదు. ఖరీఫ్ మాసూళ్లు పూర్తవ్వడంతో పండిన ధాన్యాన్ని విక్రయించి వచ్చిన సొమ్ముతో అప్పులు తీర్చుకుని మిగిలిన సొమ్ము రబీకి పెట్టుబడులు పెట్టుకుంటున్నారు. ఇప్పుడు రబీపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. చింతలపూడి సబ్‌డివిజన్‌లో 8,228 ఎకరాల్లో రైతులు రబీ వరి సాగు చేపట్టారు. వరి కాక 24,152 ఎకరాల్లో మొక్కజొన్న, 2,826 ఎకరాల్లో పొగాకు, 811 ఎకరాల్లో వేరుశనగ పండించడానికి లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు సుమారు 80 శాతం వరి నాట్లు పూర్తయ్యాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. వాతావరణం కూడా అనుకూలంగా ఉండటంతో రైతులు రబీ దిగుబడిపై ఆశలు పెట్టుకున్నారు.

కలుపు నివారణ ముఖ్యం

రబీలో మొక్కజొన్నలో కలుపు నివారణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించొచ్చని వ్యవసాయాధికారులు తెలిపారు. కలుపు నివారణకు యట్రజిన్ మందును ఎకరాకు కేజీన్నర చొప్పున నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే చలికాలం అయినందున వరిలో జింక్ లోపం తలెత్తే అవకాశం ఉందన్నారు.

నీటి యాజమాన్యం పాటించండి



భూగర్భ జలాలు ఈ ఏడాది పెరిగాయి. నీటిని ఆదా చేసుకుని మెట్టలో రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు నీటి యాజమాన్యం సక్రమంగా పాటించాలి. మార్చి వచ్చే సరికి చెరువుల్లో నీళ్లు తగ్గిపోయి సాగు నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉంది. తాగునీటితో పాటు, పశువులకు కూడా నీరు దొరక్క ఇబ్బందులు కలుగుతాయి. ఈ పరిస్థితుల్లో రైతులు వరికి బదులు మొక్కజొన్న, వేరుశనగతో పాటు అపరాల వంటి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

–బి.నాగకుమార్, చింతలపూడి సబ్ డివిజన్ ఏడీప

క్లుప్తంగా

చిక్కాలకు వైఎస్సార్‌సీపీ నేతల సంఘీభావం


చిక్కాలతో కలిసి పాదయాత్ర చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొయ్యలగూడెం: ఉభయగోదావరి జిల్లాలో ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి చిక్కాల దుర్గాప్రసాద్ నామినేషన్ కార్యక్రమానికి నిరుద్యోగ యువత తరలి రావాలని పోలవరం, చింతలపూడి నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం పిలుపునిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మీదుగా కొనసాగిన దుర్గాప్రసాద్ పాదయాత్రలో సంఘీభావం తెలుపుతూ కొంతమేర తాము కలిసి పాదయాత్ర నిర్వహించినట్లు ముప్పిడి శ్రీనివాస్, జెట్టి ఆదిత్య, మాజీ సర్పంచ్ తేలే శ్రీనివాస్ మంగళవారం పేర్కొన్నారు. ఏడో తేదీ బుధవారం ఏలూరులో ఉదయం పదకొండు గంటలకు దుర్గాప్రసాద్ నామినేషన్ వేస్తారన్నారు. దీని వలన చిక్కాల పాదయాత్రకు విరామం చేపట్టి తిరిగి ఎనిమిదో తేదీ నుంచి ఆయన పాదయాత్ర కొనసాగుతుందని వారు తెలిపారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు


పోలవరం రూరల్: పాండురంగ స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో రథసప్తమి పర్వదినం సందర్భంగా సూర్యప్రభ వాహన సేవ, చక్ర స్నానం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. స్వామివారి నిత్య ఆరాధన అనంతరం సూర్యప్రభ వాహనంపై శ్రీనివాసుని అలంకరించి భక్తుల గోవింద నామ స్మరణలతో మంగళ వాయిద్యాలతో ఆలయం చుట్టూ తిరు వీధి ఉత్సవం నిర్వహించారు. అనంతరం పుష్కరిణిలో చక్రస్నాన కార్యక్రమం ఆలయ ప్రధాన అర్చకుడు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కార్య నిర్వాహణాధికారి మాణికల రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అదే విధంగా స్థానిక శ్రీసర్వ మంగళ సహిత కాశీ విశ్వేశ్వర ఆలయంలో రథసప్తమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు దండు ధనరాజు, రెడ్డి రంగ ప్రసాద్, కంది బాలకృష్ణారెడ్డి, వాసవి సాయి నగేష్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పాండురంగ స్వామి గ్రామోత్సవం

పోలవరం రూరల్: రథ సప్తమి సందర్భంగా పోలవరం గ్రామంలో పాండురంగ స్వామిని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మేళతాళాల మధ్య నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్వామి వారిని పల్లకీలో ఏర్పాటు చేసి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అదే విధంగా విజ్ఞానభారతి పాఠశాలలో రథసప్తమి వేడుకలు నిర్వహించారు.

జంట గోపురాల వద్ద పాము కలకలం



ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైన జంటగోపురాల వద్ద ఒక పాము మంగళవారం కలకలాన్ని రేపింది. ఆ ప్రాంతంలో కూర్చున్న ఒక వృద్ధ భక్తుడిపై ఎక్కింది. దీంతో కంగారుగా ఆ భక్తుడు అక్కడి నుంచి పరుగులు తీశాడు. అయితే పాము జంట గోపురాల మెట్ల మీద నుంచి పార్కింగ్ ప్రాంతంలోకి, అక్కడి నుంచి పొదల్లోకి వెళ్లిపోయింది. అది జెర్రిగొడ్డు పాము అని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ


కొయ్యలగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: క్యాన్సర్ అవగాహన ర్యాలీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనందం సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలలో ప్రభుత్వ ప్రైవేట్ డాక్టర్లు పాల్గొని క్యాన్సర్ లోని రకాలు అవి సంక్రమించే విధానాల గురించి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు నాగార్జున, చక్రపాణి, విజేత, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రావికంపాడు జెడ్పీ స్కూల్‌లో

కామవరపుకోట: మండలంలో రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా శిక్షణాధికారి బిరుదుగడ్డ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాములు, సతీష్ కుమార్, ప్రసాద్, నల్లమోతుల సత్యనారాయణ, నాగేశ్వరరావు పల్లాలు, రమేష్, మురళీ, బాలాచలం, దేవప్రియ, చైతన్య, విజయకుమారి, ప్రియాంక, సుజాత, శారద, జయశ్రీ, గీతాదేవి, రాజశ్రీ, బాలాజీ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

సాగులో నూతన పద్ధతులు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ హబీబ్ భాషా

ద్వారకాతిరుమల: రైతులు వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గించుకుని, లాభాలు పెంచుకోవాలని, అందుకు సాగులో నూతన పద్ధతులను అవలంబించాలని జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ హబీబ్ భాషా సూచించారు. మండలంలోని బుట్టాయిగూడెంలో మంగళవారం నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎ.దుర్గారమేష్, ఉద్యానాధికారి దేవదానం, వీహెచ్ఏ నిహారిక తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు బడిబాట

కొయ్యలగూడెం: బోడిగూడెం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి చెన్నకేశవులు అధ్యక్షతన రైతు సేవా కేంద్రం వద్ద అన్నదాతలకు బడి బాట కార్యక్రమం ద్వారా పలు విషయాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా మంగప్రతీదేవి పేట గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందాలి

లింగపాలెం: రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించాలని సెరికల్చర్ డీడీ వాణి అన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం సింగగూడెం, కొత్త పల్లి గ్రామాల్లోని రైతులకు పలు రకాల పంటలపై వ్యవసాయ సెరికల్చర్ అధికారులు అవగాహన కల్పించారు. వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

అధికారులు ఆదర్శంగా నిలవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం: అధికారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని ఆర్డీవో ఎంవీ రమణ అన్నారు. మంగళవారం రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఆర్డీవో ఎంవీ రమణ జెండా ఊపి ప్రారంభించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, హెల్మెట్ ధరించిన వాహనదారులు, రవాణా, రెవెన్యూ సిబ్బంది డీఎస్పీ కార్యాలయం నుంచి బోసుబొమ్మ సెంటర్ మీదుగా జీవీ మాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో మాట్లాడుతూ రోడ్డు భద్రపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. రోడ్డు నిబంధనలను జంగారెడ్డిగూడెం డివిజన్ ప్రజలందరికి అలవాటు చేసే దిశగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉద్యోగులు హెల్మెట్ ధరించి కార్యాలయాలకు వచ్చేలా ఆదేశించామన్నారు. హెల్మెట్ ధరించకపోతే ఒక రోజు లీవ్‌గా పరిగణిస్తామన్నారు. ఆర్డీవో ఎండీ మదని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ ప్రయాణాలు సాగించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, ఆటోల్లో ఓవర్ లోడ్ ప్రయాణాలు ప్రమాదాలకు కారణంగా మారుతున్నాయన్నారు. ఒకరి అజాగ్రత్త అనేక మంది జీవితాలను అల్లకల్లోలం చేస్తుందన్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎస్ రంగనాయకులు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వై.సురేష్‌బాబు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్ది అంజన్నకు విశేష పూజలు


మద్ది ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

జంగారెడ్డిగూడెం: మండలంలలోని గుర్వాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రభాత సేవ, నిత్యార్చన పూజలు, తమలపాకుల పూజలు నిర్వహించారు. రథసప్తమి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. పలు సేవల రూపేణ మంగళవారం మధ్యాహ్నం వరకు రూ.1,66,132 వచ్చినట్లు ఆలయ ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. కార్యక్రమాలను జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పర్యవేక్షించారు.

చెరువు గట్టుపై చెట్ల నరికివేత

కొయ్యలగూడెం: మహాదేవపురం సమీపంలోని గొల్లవాని చెరువు గట్టుపై ఉన్న జామాయిల్ చెట్లు కొందరు మంగళవారం నరికి వేయడంతో వివాదాస్పదంగా మారింది. కన్నాపురం పంచాయతీ పరిధిలో ఉన్న మహాదేవపురం రైతులు ఆరోపించిన వివరాల ప్రకారం చెరువుగట్టుపై ఆరు సంవత్సరాల నుంచి పెంచుతూ వస్తున్న జామాయిల్ చెట్లను కొందరు నరికి వేసి తరలించుకుపోయారన్నారు. పంచాయతీ పరిధిలోని చెరువు కావడంతో రెవెన్యూ, పంచాయతీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అయితే అధికారులు వచ్చి వివరాలు సేకరించి వెళ్లిన పిదప తిరిగి వ్యక్తులు నరికిన కలపను గుట్టుచప్పుడు కాకుండా తరలించుకుపోయారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని తరలించుకుపోయిన కలప సుమారు రూ.లక్షపైనే ఉంటుందన్నారు.

పట్టిసం ఏర్పాట్లపై 6న రెండవ దఫా సమావేశం

పోలవరం రూరల్: మహాశివరాత్రి ఉత్సవాలు సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేసే ఏర్పాట్లపై ఈ నెల 6వ తేదీన ఉదయం 10 గంటలకు క్షేత్రం వద్ద రెండవ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ తెలిపారు. ఈ సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు అందరూ హాజరు కావాలన్నారు. ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు ఇసుక తిన్నెలపై మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరుగుతుంది.

రోడ్డుపై రైతుల బైఠాయింపు


లారీ ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు

కొయ్యలగూడెం: అటవీశాఖ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారంటూ దిప్పకాయలపాడు, కన్నాపురం గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం రాత్రి ఆందోళన నిర్వహించారు. రైతులు తెలిపిన వివరాలు ప్రకారం తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట నుంచి వర్జీనియా పొగాకు బ్యారన్ క్యూరింగ్ నిమిత్తం పుల్లను లారీలో దిప్పకాయలపాడు తీసుకొచ్చారు. దీనికి సంబంధించి పర్మిట్లు కూడా ఉన్నాయని వారు తెలిపారు. అయితే పర్మిట్ కంటే అదనపు లోడ్ ఉందంటూ కన్నాపురం అటవీ శాఖాధికారులు దిప్పకాయలపాడులో లారీని అదుపులోకి తీసుకుని కన్నాపురం కార్యాలయానికి తరలించేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న పరిసర ప్రాంత రైతులు అటవీశాఖాధికారులను నిలదీస్తూ లారీని తరలించనివ్వబోమంటూ పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఓ దశలో అటవీ శాఖాధికారులు పరుషంగా మాట్లాడారని రైతులు ఆరోపించారు. దీంతో రోడ్డుపైనే బైఠాయించి తమ ఆందోళనను కొనసాగించారు. విషయం తెలుసుకున్న జంగారెడ్డిగూడెం సబ్ డీఎఫ్‌వో పూర్తి స్థాయి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొనడంతో రైతులు ఆందోళన విరమించారు. కాగా, రైతులు వర్జీనియా పొగాకు క్యూరింగ్ నిమిత్తం పుల్లను తరలించే ప్రక్రియలో ఒక ప్రాంతంలో ఒక విధంగాను, మరొక ప్రాంతంలో మరో విధంగా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. రైతులు చేపట్టిన ధర్నాకు వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల నంది మద్దతు తెలిపారు. కన్నాపురం అటవీసెక్షన్ కార్యాలయంలో ఒకరిద్దరు అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

చింతలపూడి: 500 జనాభా కలిగిన గిరిజన తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ప్రకటించాలని ఎస్టీ బంజారా, సుగాలి, లంబాడి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారావతు కీమ్యా నాయక్ డిమాండ్ చేశారు. మండలంలోని రేచర్ల తండాలో మంగళవారం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాబాబు నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ డాక్టర్ బి.రాంబాబు నాయక్ మాట్లాడుతూ ఫిబ్రవరి 15న సేవాలాల్ జయంతిని ప్రభుత్వమే ఘనంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. తండాల్లో రోడ్లు, డ్రెయిన్లు, తాగునీ రు, వీధిలైట్లు వంటి మౌలిక వసతులు మెరుగు పరచాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రేచర్ల సంఘం అధ్యక్షుడిగా బోడా వెంకటేశ్వరరావు నాయక్, ఉపాధ్యక్షుడిగా భూక్య శ్రీను, జరబలా కిచ్చా నాయక్, ప్రధాన కార్యదర్శిగా లకావతు బుజ్జి నాయక్, తదితరులను ఎన్నుకున్నారు. నూతన కమిటీకి రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు కృష్ణా నాయక్ అభినందనలు తెలిపారు.

చిన్నారులకు ధైర్యం నింపిన ఉపాధ్యాయురాలు

జంగారెడ్డిగూడెం: చిత్ర హింసలకు గురైన చిన్నారులకు పాఠశాల ఉపాధ్యాయురాలు ధైర్యాన్ని నింపారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. చిత్ర హింసలకు గురైన ఉదయ్‌రాహుల్, రేణుకలకు గత కొద్ది రోజులుగా చిన్నారుల ఒంటిపై గాయాలు చూసి పాఠశాల ఉపాధ్యాయురాలు గెడ్డం విజయనిర్మల చలించిపోయారు. చిన్నారులకు ఈమెతోపాటు హెచ్ఎం ఎం.లక్ష్మి, మిగిలిన ఉపాధ్యాయులు ధైర్యాన్ని నూరి పోశారు. ఉదయ్‌రాహుల్, రేణుక స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపం పక్కనే ఉన్న పాఠశాలలో చదువుతున్నారు. గత కొద్ది రోజులుగా చిన్నారుల ఒంటిపై గాయాలు చూసిన ఉపాధ్యాయురాలు తల్లి గానాల శారదను పాఠశాలకు పిలిచి ఉపాధ్యాయురాలు మందలించారు. ఇకపై చిన్నారులను కొడితే సహించేది లేదని హెచ్చరించారు. ఉపాధ్యాయురాలు విజయనిర్మల చెప్పిన మాటలే ఉదయ్‌రాహుల్‌కు ధైర్యాన్ని ఇచ్చింది. దీంతోనే శనివారం అర్ధ రాత్రి పవన్‌కుమార్ చిన్నారులను కొడుతుండగా, ఉదయ్‌రాహుల్ బయటకు పారిపోయి వచ్చి సమీపంలో యువకులకు చెప్పాడు. దీంతో వారు చుట్టుపక్కల వారితో కలిసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. ఇదిలా ఉంటే విజయనిర్మల ఇచ్చిన ధైర్యంతో చిన్నారులకు మేలు జరిగిందని పలువురు అభినందిస్తున్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు ఉదయ్‌రాహుల్, రేణుకలు కోలుకుంటున్నారు. వారిద్దరి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు. బుధవారం వీరిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసే అవకాశం ఉందని చెప్పారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉదయ్‌రాహుల్ తాను పోలీసు అవుతానని చెబుతున్నాడు. తాను పోలీసు అయ్యి తప్పు చేసిన వారిని శిక్షిస్తానని అంటున్నాడు. అలాగే చిన్నారి రేణుక తాను డాక్టర్‌ని అవుతానని అంటోంది. దీంతో ఈ చిన్నారులు ఇద్దరిని ఉన్నత చదువులకు ప్రోత్సహించాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.